క్లుప్తంగా

లంకెలపాలెంలో కారు బోల్తా



బోల్తాపడిన కారు

పరవాడ: అనకాపల్లి–విశాఖ జాతీయ రహదారిలో లంకెలపాలెం వద్ద మంగళవారం అర్ధరాత్రి ఓ కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కారు ప్రమాదానికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు.. మంగళవారం రాత్రి అనకాపల్లి నుంచి విశాఖ వైపు వెళుతున్న కారు అర్ధరాత్రి 1 గంట సమయంలో లంకెలపాలెం జీపీఆర్ లేఅవుట్ సమీపానికి వచ్చింది. ఆ ప్రదేశంలో జరుగుతున్న పైపులైన్ పనులను డ్రైవర్ గుర్తించకుండా వచ్చి సడన్ బ్రేక్ వేయడంతో కారు అదుపు తప్పి బోల్తా పడింది. కారు బోల్తా పడిన సమయంలో డ్రైవరుతో పాటు ఉన్న మరో వ్యక్తి ప్రమాదం నుంచి సురక్షితంగా బయట పడ్డారు. కారు రిజిస్ట్రేషన్ ఆధారంగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన సీపాన వెంకటరమణకు చెందినదిగా తెలిసింది. బుధవారం ఉదయం క్రేన్ సహాయంతో పైకి తీసి సంబంధిత వ్యక్తి కారు తీసుకువెళ్లారని స్థానికులు చెప్పారు. ప్రమాదంపై తమకు ఫిర్యాదు అందలేదని పరవాడ ఎస్ఐ టి.మల్లేశ్వరరావు చెప్పారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు అందజేశారు.

అలరించిన సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయనీ గాయకుడు

సీతంపేట: స్వర సంగమం(హైదరాబాద్), స్వర మాధుర్యం(వైజాగ్) సంస్థల ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. సంస్థ అధ్యక్షుడు డి.ఎం.రావు, కార్యదర్శి పి.వి.రఘుపతి ఆధ్వర్యంలో గాయనీ గాయకులు సినీ గీతాలను ఆలపించి ప్రేక్షకులకు వీనుల విందు చేశారు. గాయనీ గాయకులు ఆనందరెడ్డి, సంపత్‌కుమార్, శ్రియ, శశిరాణి, శైలజ మెరాజ్, మాధవి అద్భుతంగా పాటలు పాడి శ్రోతలను మెప్పించారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తి దుర్మరణం



కోలా జోగి నాయుడు (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: అమ్మవారి పండగకు లైటింగ్ పనులు నిర్వహిస్తున్న వ్యక్తి కరెంట్ షాక్‌కు గురై దుర్మరణం చెందాడు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక సింహగిరికాలనీకి చెందిన కోలా జోగినాయుడు (43) ఆటో డ్రైవర్. స్థానికంగా లైటింగ్ పనులు కూడా చేస్తుంటాడు. కాలనీలో అమ్మవారి పండుగ సందర్భంగా మంగళవారం రాత్రి సీరియల్ లైటింగ్ పనులు చేస్తున్న సమయంలో వర్షం పడుతుండటంతో ఒక్కసారిగా కరెంట్ షాక్‌కు గురయ్యాడు. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన జోగినాయుడును స్థానికులు గాజువాకలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించినట్లు చెప్పారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

29న జాతీయ లోక్ అదాలత్

గాజువాక: జాతీయ న్యాయ సేవ ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.షణ్ముఖరావు తెలిపారు. గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న ఈ అదాలత్‌లో అన్ని రకాల బ్యాంకు కేసులు, విద్యుత్, నీరు, టెలిఫోన్, యుటిలిటీ తగాదాలు, రాజీ పడదగ్గ అన్ని క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ కేసులు, పెట్టీ కేసులు, మున్సిపల్ వివాదాలు రాజీమార్గంలో పరిష్కరిస్తామన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం

డీఎస్పీ సత్యనారాయణ



మాట్లాడుతున్న పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

సబ్బవరం: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ సూచించారు.అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి సబ్బవరం మూడు రోడ్ల కూడలి వరకూ బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.అనంతరం మూడు రోడ్ల కడలిలో మానవ హారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ సత్యనారాయణ మాట్లాడుతూ యువత,విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడడం వల్ల సమాజానికి తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. బంగారం లాంటి భవిష్యత్తు అంధకారం అవుతుందని తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు బానిసలైన వ్యక్తులు అనారోగ్యం పాలవ్వడమే కాకుండా వారి కుటుంబాలు నాశనమవుతాయన్నారు.మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకోవడానికి సహకరించాలని కోరారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాలు విక్రయించినా.. సేవించినా.. రవాణా చేసినా సమాచారం ఇవ్వాలన్నారు. అలాంటి వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో సెబ్ సీఐ పీడీ ప్రసాద్,స్థానిక సీఐ పిన్నింటి రమణ,ఎస్ఐలు రాజశేఖర్, ధనుంజయ్‌తో పాటు పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపులో ఉద్రిక్తత



ప్రభుత్వ భూమిలో నిర్మించిన పక్కా గృహం వద్ద మోహరించిన పోలీసులు, రెవెన్యూ సిబ్బంది



ఇంట్లో పెట్రోల్ బాటిల్,తాడుతో దంపతులు

- ఆత్మహత్య చేసుకుంటామని బెదిరింపు
- వెనుదిరిగిన రెవెన్యూ,పోలీస్ సిబ్బంది

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి రెవెన్యూ పరిధిలోని లగుడువారి కొంపల వద్ద ప్రభుత్వ భూమిలో నిర్మించిన పక్కా భవనం తొలగింపులో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.ఆర్ఐ వీరయ్య,స్థానికులు,బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అంతకాపల్లిలో సర్వే నెంబర్ 618/15లో 5.90 ఎకరాల గెడ్డవాగు ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమిలోని కొంత భాగంలో అదే గ్రామానికి చెందిన వెన్నల అప్పారావు అనే వ్యక్తి పక్కా భవనం నిర్మించాడు. అయితే గ్రామస్తులైన వెన్నల పైడం, ముత్యాలనాయుడు,కనకారావు,నాయుడు తదితరులు పక్కా భవనం నిర్మాణం జరుగుతుండగా పలు మార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.అధికారులు పలు మార్లు హెచ్చరించినా సెలవు దినాల్లో దఫదఫాలుగా ఇంటి నిర్మాణం పూర్తి చేశారు.దీంతో గ్రామస్తులు కోర్టును ఆశ్రయించారు. గెడ్డవాగులోని నిర్మాణం కూల్చివేయాలని రెవెన్యూ అధికారులకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది.దీంతో రెవెన్యూ సిబ్బంది బుధవారం పోలీసుల సాయంతో రెండు పొక్లెయిన్లతో అక్రమ నిర్మాణం తొలగించేందుకు వెళ్లారు. విషయం తెలుసుకొన్న ఇంటి యజమాని అప్పారావు దంపతులు పెట్రోల్ బాటిల్,తాడు పట్టుకొని ఇంటి లోపల గడియ పెట్టుకున్నారు. ఇంటిని కూల్చివేస్తే ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించారు. దీంతో గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకొని యంత్రాలు ఇంటివద్దకు వెళ్లకుండా రోడ్డుపైనే అడ్డుకున్నారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. డిప్యూటీ తహసీల్దార్ వెంకట్,ఆర్ఐ వీరయ్య మాట్లాడుతూ ఇక్కడ జరిగిన వ్యవహారాన్ని కోర్టుకు నివేదిక రూపంలో సమర్పిస్తామని చెప్పారు.అక్రమ నిర్మాణం తొలగించేందుకు వెళ్లినవారిలో సీఐ పిన్నింటి రమణ,ఎస్ఐ ధనుంజయ్, వీఆర్వోలు వీవీఎస్ఎన్ మూర్తి,వెంకటేష్,అనంత్‌తో పాటు పలువురు రెవెన్యూ,పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఘనంగా జాగృతి సంస్థ వార్షికోత్సవం



సంస్థ వార్షిక నివేదిక బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నాబార్డు డీడీఎం సమంత కుమార్ తదితరులు

సబ్బవరం: జాగృతి పరస్పర సహాయ సహకార సంస్థ మరింత విస్తరించాలని నాబార్డు డీడీఎం సమంత కుమార్ ఆకాంక్షించారు. మండలంలోని గొటివాడలోని ఓ ప్రైవేటు కన్వెన్షన్ హాల్‌లో బుధవారం జాగృతి పరస్పర సహాయ సహకార పొదుపు సంస్థ మహాజనసభ,వార్షిక సమావేశం నిర్వహించారు.సొసైటీ అధ్యక్షుడు కోట్ని అమ్మతల్లినాయుడు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ కోట్ల డిపాజిట్లతో కార్పొరేట్ రంగ బ్యాంకుల స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సంస్థ వార్షిక నివేదికను జాగృతి పాలకవర్గ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కందర్ప సుజాత వార్షిక నివేదికను చదివి వినిపించారు. రెండు జిల్లాల్లోని 6 మండలాల పరిధిలోని 148 గ్రామాల్లో 21,966 మంది సభ్యులతో రూ.31.92 కోట్లు టర్నోవర్‌తో నడుస్తుందన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఎన్నికల అధికారి వీవీ సుబ్రహ్మణ్యం సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నంబారు సూర్యనారాయణ,మేనేజింగ్ డైరెక్టర్‌గా కందర్ప సుజాత,ఉపాధ్యక్షురాలిగా గుర్రం అప్పలనర్సమ్మను ఎన్నుకున్నారు. ఆడిటర్ వడ్లమాని సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల పెంపకంపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి సత్యనారాయణరెడ్డి

సీతమ్మధార: ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో బుధవారం సీతమ్మధార రైతుబజారులో కూరగాయల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన శాఖాధికారి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పందిరి కూరగాయల సాగు, వేసవిలో పెంపకం, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా కూరగాయల పెంపకం, మల్చింగ్ పద్ధతిలో కూరగాయల సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ సాగుపై రాయితీల కోసం వివరించారు. పందిరి మీద కూరగాయలు పెంచడం వల్ల లాభాలు వస్తాయన్నారు. కూరగాయల విత్తనాలు కొనేటప్పుడు క్యాష్ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. వారికి ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తుందన్నారు. ఆధార్ కార్డు, వన్ బీ కాపీ, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ రైతు భరోసా కేంద్రంలో ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ అధికారి ఎస్.కె.యాసిన్, ఉద్యానవన అధికారి జి.సోని, రైతుబజార్ ఈవో పి.కొండబాబు, సహాయకుడు కె.సతీష్, రైతులు పాల్గొన్నారు.

లలితా పీఠంలో దక్షిణామూర్తి ఆరాధన



హారతిస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీలలితా పీఠం వ్యవస్థాపక పీఠాధిపతి దక్షిణామూర్తి పరమహంస ఆరాధన జరిగింది. లలితానగర్‌లోని పీఠం ఆవరణలో గల దక్షిణామూర్తి మందిరంలో స్వామికి విశేష అభిషేకం, అర్చన అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా కుర్తాళం శంకరాచార్యులు, ప్రస్తుత లలిత పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి స్వయంగా దక్షిణామూర్తికి ప్రత్యేక హారతి సమర్పించారు.

ఆకట్టుకున్న భక్త నత్కీర నాటక ప్రదర్శన



నాటకాన్ని తిలకిస్తున్న సిద్ధేశ్వరానంద మహాస్వామి

సీతంపేట: శ్రీలలితా పీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం రంగస్థల కళాకారుడు, పలు నంది పురస్కారాల గ్రహీత డాక్టర్ మీగడ రామలింగస్వామి బృందం ప్రదర్శించిన భక్త నత్కీర నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. శ్రీకాళహస్తి మహత్స్యం కావ్యం ఆధారంగా మీగడ రామలింగస్వామి రచించిన ఈ నాటకంలో ఆయన నత్కీరుడు పాత్ర అద్భుతంగా పోషించారు. పాండ్య రాజుగా వి.సత్యం, నారదుడిగా డాక్టర్ అత్తిలి శంకర్, హరద్విజుడుగా ధూపం గురుమూర్తి, మహామంత్రి కె.గోపినాయుడు, మహాశివుడుగా జి.సూర్యనారాయణ, బాల శివభక్తులుగా హనీష్, సహస్ర, దాసరిగా రుద్రనారాయణ, బుడత కీచకుడిగా డాక్టర్ మోహనరావు, రాజనర్తకిగా ఎస్.సరస్వతి తదితరులు చక్కని నటనతో రసోచితమైన పద్య పఠనంతో ఆద్యంతం ప్రేక్షకులను సమ్మోహన పరిచారు. వీరికి హార్మోనియంపై మీగడ మల్లికార్జున స్వామి, డోలక్‌పై కె.బాలకృష్ణ వాద్య సహకారం అందించారు. అలంకరణ, ఆహార్యం మీరా, సత్యం చేశారు. కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో జరిగిన నాటక ప్రదర్శనను పెద్ద సంఖ్యలో భక్తులు వీక్షించారు. ఈ సందర్భంగా స్వామి వారి చేతుల మీదుగా నాటక బృందాన్ని ఘనంగా సత్కరించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'అగ్నిపథ్'ను రద్దు చేయాలి



ధర్నాలో పాల్గొన్న ఏఐవైఎఫ్ నాయకులు

గాజువాక: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నిపథ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ నాయకులు పాతగాజువాక జంక్షన్‌లో బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.అచ్యుతరావు మాట్లాడుతూ అగ్ని పథ్ ద్వారా చేపట్టిన నియామకాల్లో ఉద్యోగం కేవలం నాలుగేళ్లు మాత్రమే ఉంటుందన్నారు. అగ్నిపథ్ ద్వారా ఉద్యోగాల్లో చేరిన యువత తర్వాత నిరుద్యోగులుగా మారుతారన్నారు. దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వై.రాంబాబు, ఈశ్వరరావు, ఎస్.శ్రీను, శివ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్



పార్కు పనుల తీరును అధికారులను అడిగి తెలుసుకుంటున్న ఏడీసీ విశ్వనాథన్

పెదగంట్యాడ: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్ ఆదేశించారు. జీవీఎంసీ 65వ వార్డులోని ఇండోర్ స్టేడియంతో పాటు 76వ వార్డులోని హౌసింగ్ బోర్డు కాలనీలో కొత్తగా చేపట్టిన పార్కు నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల ప్రగతిపై ఆరా తీశారు. పనుల్లో నాణ్యతను పరిశీలించారు. ఏయే పనులు చేస్తున్నారో నిశితంగా చూశారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఇండోర్ స్టేడియం లోపల సీలింగ్, గచ్చులు, బయట ఎలివేషన్ పనులను గతంలోనే ప్రారంభించినా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత పనులు నిలిపివేశారు. కోడ్ అనంతరం పనులు పునఃప్రారంభం కావడంతో ఆ పనులను ఏడీసీ విశ్వనాథన్ స్వయంగా పరిశీలించారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దన్నారు. అలాగే హౌసింగ్ బోర్డు కాలనీలో చేపట్టిన పార్కు నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాలని, నిర్లక్ష్యం వహించినా, నాణ్యత పాటించకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏడీసీ పర్యటనలో జీవీఎంసీ జోన్–6 జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు, దీఈ ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

పెదగంట్యాడ: బాల్య వివాహాలు అనర్థాలకు మూలమని, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని కళాజాత కళాకారులు వివరించారు. ఐసీడీఎస్ పెందుర్తి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఇస్లాంపేట సెక్టార్ పరిధిలోని రెడ్డి ముసలయ్య పాలెం, పెదనడుపూరు, సీతానగరం–2, దల్లివానిపాలెం, కోనవానిపాలెం తదితర ప్రాంతాలకు చెందిన అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన వారి కోసం దుర్గవానిపాలెం సచివాలయం వద్ద బుధవారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలు, బాలింతలు, గర్భిణులకు, స్థానిక మహిళలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాలల హక్కు చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారం గురించి ఆటపాటలతో వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ చెరువు మూసివేయాలని ఆందోళన



చెరువు వద్ద ఆందోళన చేస్తున్న రైతులు, సీఐటీయూ నాయకులు

పరవాడ: తానాం గ్రామాన్ని ఆనుకొని రాంకీ యాజమాన్యం అక్రమంగా తవ్విన చెరువును మూసివేయాలని ఆ గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. చెరువును మూసివేయాలని కోరుతూ గ్రామ ప్రజలు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ తానాం గ్రామాన్ని ఆనుకొని రాంకీ యాజమాన్యం తవ్విన చెరువుపై రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేయడం జరిగిందన్నారు. గ్రీన్‌బెల్ట్ నిబంధనలను ఉల్లంఘించి తవ్వకాలు సాగించిన చెరువును మూసివేయాలని ఆదేశాలు ఇచ్చినా మూసివేయకపోవడం అన్యాయమన్నారు. వెంటనే గ్రీన్‌బెల్ట్‌ను అభివృద్ధి చేసి కాలుష్యాన్ని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని గనిశెట్టి కోరారు. రొంగలి అప్పారావు, వర్రి భవాని, వి.కన్నంనాయుడు, వర్రి అప్పారావు, ఆర్.ఎర్రయ్యమ్మ, వి.సన్యాసి, దేముడు పాల్గొన్నారు.

వుషు పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన



పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులతో పాఠశాల సీఈవో నిశాంత్, ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

పరవాడ: పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి వుషు పోటీల్లో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రాజమండ్రిలో ఈ నెల 28న రాష్ట్ర వుషు సంఘ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి చెప్పారు. విద్యార్థులను కోచ్ రమ్య, పాఠశాల సీఈవో కె.నిశాంత్, అభినందనలు తెలిపారు.

క్రీడాకారులు వివరాలు

- జూనియర్ బాయ్స్ విభాగంలో స్టీఫెన్–45 కేజీలు, భార్గవ్–65 కేజీలు, రాహుల్–70 కేజీలు, అభినవ్–75 కేజీలు, యూత్ బాయ్స్‌లో క్రిష్ దేవని–70 కేజీలు.
- జూనియర్ గరల్స్ విభాగంలో హిమానిషి పర్మార్– 45 కేజీలు, చార్వి–48 కేజీలు, ఆర్పిత–56 కేజీలు, రోషిణి–60 కేజీలు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ

పరవాడ: తానాం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తానని ఆ గ్రామ సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ అన్నారు. పాఠశాలలో బుధవారం సర్పంచ్ దేవి వెంకటరమణ విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. విద్యార్థులకు అవసరమైన బ్యాగులు, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం ప్రభుత్వం కల్పిస్తుందని ఆమె చెప్పారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఉప సర్పంచ్ వర్రి మంగలక్ష్మి వసంతరావు, ప్రిన్సిపాల్ ఎస్.కె.శ్రీదేవి, ఎల్ఐసీ అప్పారావు, వార్డు సభ్యులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కిటకిటలాడుతున్న కేజీహెచ్

మందుల కౌంటర్ల వద్ద రద్దీ విపరీతం



కేజీహెచ్‌లో మందులు ఇచ్చే గది వద్ద రద్దీ

మహారాణిపేట: కేజీహెచ్‌లో రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వైద్యం కోసం రోగులు అధిక సంఖ్యలో వస్తున్నారు. దీంతో వారికి మందులు ఇచ్చే కౌంటర్లు కూడా రద్దీగా ఉంటున్నాయి. గత మూడు రోజుల నుంచి మందులు ఇచ్చే కౌంటర్లు రోగులు, వారి సహాయకులతో కిటకిటలాడుతున్నాయి. ఈ రద్దీని దృష్టిలో పెట్టుకొని కేజీహెచ్ సూపరింటెండెంట్, కలెక్టర్ గతంలో కౌంటర్లు పెంచారు. ఓపీ విభాగంలో మూడు కౌంటర్లు, ఆంధ్రా బ్యాంక్ పక్కన అయిదు కౌంటర్లు ఏర్పాటు చేసి ఆధునీకీకరించారు. గర్భిణులు, పిల్లలు, వృద్ధులు, కేజీహెచ్ సిబ్బందికి ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఇందులో ఫార్మాసిస్టులతో కౌంటర్లు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ గత మూడు రోజులుగా అన్ని కౌంటర్లు కిటకిటలాడుతున్నాయి. ఇక్కడి ఆస్పత్రికి ఉమ్మడి విశాఖ నుంచే కాకుండా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళంతోపాటు ఒడిశా, ఉభయ గోదావరి జిల్లాల నుంచి రోగులు వస్తుంటారు. మందుల కోసం రోజు వారీ రోగులే కాకుండా పాత రోగులు కూడా చీటీలు తీసుకొని కౌంటర్లకు వస్తుండడంతో రద్దీ ఎక్కువగా వుంది.

జీవితానుభవాల నుంచే కథలు



మాట్లాడుతున్న రచయిత సుగుణరావు

సీతంపేట: రచయితకు సాంఘిక బాధ్యత ఉండాలని రచయిత డాక్టర్ ఎం.సుగుణరావు అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో జరిగిన కథా కచేరీలో వైవిధ్య భరితమైన కథలను రచయితలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కథలనేవి ఆకాశంలోంచి ఊడిపడవని, జీవితానుభవాలే కథలకు ముడిసరుకని పేర్కొన్నారు. కథా వస్తువు కోసం జీవితాన్ని, శైలి కోసం సాహిత్యాన్ని చదవాలని సూచించారు. నడుస్తున్న చరిత్రను రికార్డు చేసే సాంఘిక బాధ్యత రచయితకు ఉండాలన్నారు. పీడిత, తాడిత, దళిత, బహుజన, మహిళావాద దృష్టి కోణం నేపథ్యంలో వచ్చిన వందలాది కథలను అధ్యయనం చేసిన తర్వాతే ఔత్సాహిక రచయితలు కలం పట్టాలన్నారు. రాజకీయ సామాజిక అంశాలు, సమస్యలను ఆకళింపు చేసుకుని నిబద్ధతగా రాసే ప్రతి రచయిత మంచి సృజనకారుడు అవుతాడని చెప్పారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ జీవితం నుంచే కథానికలు వస్తాయని, కథాశిల్పం సరిగా లేకపోతే కథనం దెబ్బతింటుందన్నారు. సిహెచ్.చిన సూర్యనారాయణ, ఎస్.విజయ్‌కుమార్, కుప్పిలి భీమేశ్వరరావు, రామతాత, కె.వి.ఎస్.మూర్తి, పీవీఆర్ కుమారరావు, పరమేశ్వరరావు, రాధారాణి, సురేష్ తదితరులు కథా పఠనం చేశారు.

స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలి



మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకుడు రామస్వామి

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపేందుకు చర్యలు చేపట్టాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు యు.రామస్వామి కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1231వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో పాల్గొన్న రామస్వామి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం ద్వారా విశాఖ ఉక్కు పురోభివృద్ధి సాధించగలదన్నారు. సెయిల్ నుంచి వేరు చేసే సందర్భంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన వనరులు సమకూర్చుతామని హామీ ఇచ్చారని, కాని నెరవేర్చలేదు సరికదా లాభాల్లో ఉన్న ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టేసి నామమాత్రపు రేటుకు అమ్మేయాలని చూస్తుండడం దారుణమన్నారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావల్సిన మైన్స్ అనుమతులు వెంటనే ఇప్పించాలని వర్కింగ్ క్యాపిటల్‌ను అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.రామరావు, విళ్లా రామ్మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.